
# ఆడపిల్లనే! అయితేనేం?



డాక్టర్ పి. వెంకట రామిరెడ్డి.

రాత్రి యింట్లో పెద్ద యుద్ధమే జరిగింది. మమ్మీ, డాడీతో సహా అంకుల్, ఆంటీల్లాంటి సోకాల్డ్ వెల్‌విషర్స్ అందరూ ఏకధాటిగ నా మీద విరుచుకుపడ్డారు. నన్ను మొండిదానివన్నారు. ఉద్యోగం చేస్తున్నందుకు పొగరెక్కింది అన్నారు.

చివరకు అందరూ కలిసి నేనో మూర్ఖురాలినని, యిప్పుడొస్తున్న సినిమాలు, సాహిత్య ప్రభావం వల్ల చెడిపోయిన దాన్నని తీర్మానించారు. బయటకు చెప్పలేకపోయినా, నాకు కాస్త మోరల్ సపోర్ట్‌గ నిలిచింది ఒక్క నా చెల్లెలు మాత్రమే. కాని ఏం లాభం? గట్టిగా నా తరఫున వాదించే ధైర్యం ఆ పిల్లకు లేదు. అది ఆ పిల్ల తప్పు కాదు. ఆడపిల్లంటే అణిగి వుండాలన్న మెంటాలిటీ వదులుకోలేక పోతున్న తల్లిదండ్రులది. అలాంటి పేరెంట్స్‌ని ఎంకరేజ్ చేస్తున్న మన సమాజానిది.

స్త్రీ దేవతా సమానం, పూజించండి లాంటి పాత చింతకాయ పచ్చడి స్టేట్‌మెంట్స్ ఎవరిక్కావాలి? ఆడపిల్లకూ ఆత్మాభిమానమనేది వుంటుంది. అది గుర్తించండి చాలు. అని అనాలనిపించింది. అరిస్తే పిచ్చిదంటారు. అందుకే నిగ్రహించుకున్నాను "సుజా?! డోంట్ బి ఫూలిష్! కాస్త ప్రాక్టికల్‌గా ఆలోచించు. అందులో తప్పేం లేదు. మేం చెప్పేది నీ మేలుకోరే" విసుగును, కోపాన్ని దాచుకునే ప్రయత్నమేదీ చేయకుండానే చెప్పేసి డాడీ తన రూంలోకి వెళ్ళిపోయాడు.

"చూడవే! మొండి పట్టు పట్టకు. నీకు మంచి సంబంధంతో పెళ్ళి చేయాలనేది మా తాపత్రయం. అది మా బాధ్యత కూడా. అందుకే ఈ అవకాశాన్ని వదులుకోదల్చుకోలేదు. నీ అదృష్టం వల్లే ఈ సంబంధం కుదిరింది. నీ మూర్ఖత్వంతో కాలదన్నుకోకు. వాళ్ళు కోరిందాంట్లో అసహజమేమీ లేదు.. అయినా జీవితమన్న తర్వాత కొంత అడ్జస్ట్‌మెంట్ తప్పదు" వాదిస్తే లాభం లేదనుకుందేమో! అందుకే అందరు వెళ్ళిం తర్వాత నా బెడ్ దగ్గరకొచ్చి హితోపదేశం చేసి వెళ్ళింది మమ్మీ.

జీవితంలో కొన్ని విషయాల్లో రాజీ పడడం తప్పదని తెలీని మూర్ఖురాల్ని కాదు. కాని "నువ్వు ఆడపిల్లవు కాబట్టి నువ్వు మాత్రమే అడ్జస్ట్ అవ్వాలి" అంటే నే నొప్పుకోను. ఇదే మాటంటే ఈ సంబంధం కుదిర్చిన అంకుల్ అన్నాడు. "కాస్త డిగ్రీ చదివేసరికి ఈ కాలం అమ్మాయిలు హక్కులు, ఆదర్శాలు అంటు జీవితాల్ని నరకం చేసుకుంటున్నారు" అని నిజానికి ఫెమినిజం, హక్కులు లాంటి పెద్ద పెద్ద పదాలు అవసరం లేదు. ప్రతి మనిషికీ ఆకలి, నిద్రల్లాగే ఆత్మాభిమానమనేది కూడా అవసరం. అందులో ఆడ, మగ అనే తేడాలు లేవు. అన్న చిన్న నిజాన్ని ఈ కాలపు పెద్దోళ్ళు ముఖ్యంగా మగాళ్ళు గ్రహించనంత వరకు ఎంత మంది చలంలు పుట్టినా, ఎన్ని అంతర్జాతీయ మహిళా సదస్సులు నిర్వహించినా లాభం లేదు.

ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. పెళ్ళితో ఆడపిల్ల కోల్పోయేది ఒక్క యింటి పేరునే కాదు. కొంత స్వేచ్ఛనీ, మరి కొంత ఆత్మగౌరవాన్ని కూడా. ఆలోచనల్తో తల తిరిగిపోతోంది. ఎవరి మీదో తెలీని కసి, కోపం, దుఃఖం... ఆడపిల్లగా పుట్టడంలో వున్న అసౌకర్యాన్ని జీవితంలో మొదటిసారిగా అనుభవిస్తున్నాను.

ఒక వారం రోజుల క్రిందటి వరకు ఎంతో సంతోషంగా వుండేదాన్ని. మమ్మీ, డాడీ నాతో ఎంత ప్రేమగా వుండేవారు! నేను చాలా అదృష్టవంతురాల్ని అనుకునేదాన్ని. కాని నా ఆనందాన్ని, అదృష్టాన్ని విధి పెళ్ళి సంబంధం పేరుతో వెక్కిరించింది. నాన్నగారి కొలీగ్, ఫామిలీ ఫ్రెండ్ అయిన రాఘవరెడ్డి అంకుల్ ఒక ప్రపోజల్ తీసుకొచ్చాడు. అబ్బాయి ఒకడే కొడుకు. మెకానికల్ ఇంజనీరు. పైగా వాళ్ళ నాన్నగారు బిజినెస్‌లో చాలా సంపాదించాడట. ఇంకేం మరో ఆలోచన లేకుండా సంబంధాన్ని ఖాయం చేశారు. నాక్కూడా కాదనేందుకు కారణం కనబడలేదు.

పెళ్ళి కొడుక్కుండాల్సిన క్వాలిఫికేషన్స్ అన్నీ అతనిలో వున్నాయి. ఆ తర్వాత ఇంటికొచ్చిన వాళ్ళతో డాడీ గర్వంగా చెప్పేవారు. బహుశా ఆస్తి, ఉద్యోగం, తక్కువ కట్నం యివేనేమో ఆ క్వాలిఫికేషన్స్. కాని యివి అల్లుడయేందుకు అవసరమైన క్వాలిఫికేషన్స్ కావచ్చు. భర్తయేందుకుండాల్సిన క్వాలిఫికేషన్స్ యివికాక యింకొన్ని వున్నాయి. కాని దురదృష్టవశాత్తు మన దేశంలో చాలా మంది ఆడపిల్లలకు పెళ్ళికి ముందే ఆ 'అడిషనల్' క్వాలిఫికేషన్స్ తెలుసుకునే అవకాశం రాదు. ఇవన్నీ నా స్వగతానికే పరిమితం. కాని నాకా అవకాశం ఆ తర్వాత మూడ్రోజులకు వేరే విధంగా వచ్చింది. రాఘవరెడ్డి అంకులే ఆ కబురు తెచ్చాడు. ఆనాటి నుండి మొదలైంది ఇంట్లో ఘర్షణ. నాలో సంఘర్షణ.

ఇంతకీ ఆ కబురు సారాంశమేమిటంటే పెళ్ళికి ముందు నేను రెండు పనులు చేయాలి. ఒకటి కాస్త ఎత్తుగా వున్న నా ముందు రెండు పళ్ళను పీకించుకోవాలి. రెండోది పొడవుగా వున్న నా జడను కత్తిరించుకుని "పోనీ" స్టయిల్ చేయించుకోవాలి. అది విన్న షాక్‌లోంచి నేను తేరుకునే లోపలే అంకుల్ చెప్పుకుపోతున్నాడు.

"భార్య అందంగా వుండాలని కోరుకోవడం తప్పుగాదు గదండీ!"

డాడీ అదేమంత ఆలోచించదగ్గ పెద్ద విషయం కాదన్నట్టు "అలాగే" అనేస్తున్నాడు.

"... అన్నట్టు సుజాతా! నాకు తెలిసిన ఓ డెంటిస్టు వున్నాడు... నీకు ఎప్పుడు వీలవుతుంది.." నా అభిప్రాయమసలే అప్రస్తుతమన్నట్టు తనే నిర్ణయం తీసుకున్నాడు అంకుల్.

నేను వెంటనే కల్పించుకుని "ఈ కండిషన్స్ పెళ్ళి చూపుల రోజే ఎందుకు చెప్పలేదు?" అనడిగాను. దీనికి అంకుల్ యిచ్చిన సమాధానం మరింత కంపరం పుట్టించింది.

"నిజానికి ఆ అబ్బాయి చాలా మంచి వాడమ్మా! కాని నీ ఫోటో చూసినతర్వాత అతడి ఫ్రెండ్స్, బంధువులు పళ్ళు ఎత్తుగ వున్నాయే అన్నారట. ఇక హెయిర్ స్టయిల్ విషయానికొస్తే వాళ్ళ ఫ్రెండ్ మిసెస్ సజెస్ట్ చేసిందట. ఎంతైనా సిటీలో వాళ్ళు కదమ్మా!

### అనుపమ్‌ఖేర్
### ఆడంబరయత్నం

హిందీ నటుడు అనుపమ్ ఖేర్ శరవేగంతో 'మెట్రో' కోసం మూడున్నర గంటల షో ఒకదాన్ని రూపొందిస్తున్నాడు. ప్రభుదేవా పైసా ఖర్చులేకుండా నటించాడు. చేతికందినంత జనాల దగ్గర లక్షలు వసూలు చేస్తున్నాడు అనుపమ్‌ఖేర్! — సత్యశ్రీ

అయినా ఈ జడలు యిప్పుడు ఎవరేసుకుంటున్నారు గనుక?"

నాకు నవ్వొచ్చింది, పెళ్ళి కొడుకును మంచి వాడన్నందుకు. ఈ విషయాన్ని పెళ్ళి చూపులు రోజే చెప్పంటే పోనీలే కనీసం తనకు కాబోయే భార్య ఎలా వుండాలన్న నిర్దిష్ట అభిప్రాయం వుంది అనుకునే దాన్ని. కాని ఎవరో ఏదో అన్నారని దాన్ని నా మీద రుద్దాలనుకోవడం అతడి వ్యక్తిత్వ లేమిని సూచిస్తోంది. రేప్పొద్దున యింకో ఫ్రెండ్ మీ ఆవిడ స్ట్రక్చర్ బాగా లేదంటాడు. అప్పుడు మొత్తం బాడీనే ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోమంటాడా. అయినా తమ మంచితనపు ముసుగు తొలగకుండా స్త్రీలతో పనులు జరిపించుకునే విద్యను ఈ మగాళ్ళు రామాయణం నుండే గ్రహించారు కాబోలు! నిండు గర్భిణీ సీతను అడవులకు పంపి కూడా శ్రీరాముడు ప్రజావాక్కును పాలించాడనే కీర్తిని పొందగలిగాడు. ఇవే కోరికల్ని పెళ్ళయిం తర్వాత ప్రేమగా అడిగి వుంటే ఆయన కోసం ఒప్పుకుని వుండేదాన్నేమో! కాని ఆడది కదా! ఒప్పుకోక చస్తుందా! అనే అహంకార భావంతో షరతులుగా విధించడాన్ని నేను ప్రొటెస్ట్ చేస్తున్నాను. అందుకే "ఈ పనులు చేయడానికి నేనంగీకరించడం లేదు" అంటూ దృఢంగా, స్థిరంగా చెప్పేశాను. అందరూ విస్మయంగా నా వైపు చూశారు.ఆ విస్మయం విసుగై, కోపమై రోజూ మా మధ్య చిచ్చు పెడుతోంది. నేను మాత్రం ఈ విషయంలో రాజీ పడదలచుకోలేదు. ఇన్నేళ్ళపాటు నా నవ్వునీ, ఏడుపునీ పంచుకున్న నా పళ్ళను నా పెళ్ళికోసం త్యాగం చేయలేను. కాలేజీ రోజుల్లో నాకు 'కోకోకేర్ గర్ల్' అనే నిక్‌నేమ్‌ని సంపాదించి పెట్టిన నా కిష్టమైన, గర్వకారణమైన నా హెయిర్‌ని, నా అనుభూతులకు విలువివ్వని యింకెవ్వరి ఆనందం కోసమో కోల్పోదలచుకోలేదు.

వూరికే ఆలోచిస్తూ కూర్చుంటే లాభం లేదు ఈ సమస్యకు ఏదో ఒక పరిష్కారాన్ని వెతకాలి అనుకున్నాను. ఆ పరిష్కారం సమస్య సృష్టించిన వాళ్ళ దగ్గర్నుండి వస్తేనే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన ప్రతిరూపమే మరునాటి రోజు పెళ్ళి కొడుక్కి నేను రాసిన ఉత్తరం.

ఇది జరిగిన ఓ వారం రోజులకు రాఘవరెడ్డి అంకుల్ ఓ విధమైన విచార వదనంతో ఇంటికి వచ్చాడు. వాళ్ళు ఈ సంబంధాన్ని కాన్సిల్ చేసుకున్నారన్న విషయాన్ని విషాదంగా వెళ్ళగక్కాడు. మమ్మీ, డాడీ మొహాలు పాలిపోయాయి. బహుశా సదరు పెళ్ళికొడుకుగారిచ్చారేమో? నేను రాసిన ఆ లెటర్ కూడ తీసుకొచ్చాడు. మమ్మీ, డాడీ దాన్ని చదివి ఏమనుకున్నారో ఏమో ఒక్క మాట కూడా అనకుండా అలాగే వుండిపోయారు. వాళ్ళ చేతుల్లో ఆ లెటర్ చూడగానే నేను రాసిన వాక్యాలు ఒక్కొక్కటే గుర్తుకు రాసాగాయి.

"మీరు చెప్పినట్లు నేను పళ్ళు పీకించుకోడానికి, పోనీ చేయించుకోడానికి సిద్ధమే. అయితే నాది ఒక కండిషన్. మీరు బట్టతల మీద హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకోవాలి. రెగ్యులర్ ఎక్సర్‌సైజ్ చేసి మీ భారీకాయాన్ని తగ్గించుకోవాలి. ఇడ్లీ మందమున్న మీ కళ్ళద్దాలు తీసేసి కాంటాక్ట్ లెన్స్ వేయించుకోవాలి"

నేను ఇంట్లోకి వెళ్తుంటే అంకల్ మాటలు వినబడ్డాయి. "ఆడపిల్లకంత హెడ్‌వెయిట్ పనికి రాదు. ఇక మీదట బుద్ధి వుంటే ఈ వ్యవహారాల్లో తలదూర్చను"

నాకు నవ్వొచ్చింది. మగాడు భార్య అందంగా వుండాలనుకోవడం సహజం. అ ఆడది భర్త అందంగా వుండాలనుకుంటే హెడ్ వెయిట్. గో టు హెల్ విత్ యువర్ డబుల్ స్టాండర్డ్ మొరాలిటీ! నా కిప్పటెంతో రిలీఫ్‌గా వుంది. నా నవ్వుతోపాటు నా పళ్ళనీ ప్రేమించగలిగే మనిషి కోసం నా జీవితమంతా ఎదురు చూడాల్సి వచ్చినా బాధపడను.